1St Year
Happy Work Anniversary.

షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
RNI : APTEL / 2023 / 89152

Good for Health
Best for Readers
THE POWER OF PEN RK

సంపుటి : 2 సంచిక : 349 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ శుక్రవారం 19 డిసెంబర్ 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 349 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Friday 19 December 2025 PAGES : 8 PRICE : 3/-



## రాష్ట్రాలకు కేంద్ర అంబులెన్సులు: గడ్కరీ

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,డిసెంబర్ 18)

దేశంలో రోడ్డు ప్రమాదాలు ఆందోళనకరంగా పెరుగుతుండటంతో రాష్ట్ర ప్రభుత్వాలకు ఆధునిక అంబులెన్సులను అందించడానికి కేంద్రం సిద్ధంగా ఉందని కేంద్ర రవాణా మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. 10 నిమిషాల్లో ప్రమాదస్థలాలకు చేరుకోవాలనే షరతుపై వాటిని అందజేస్తామని రాజ్యసభలో బుధవారం ప్రకటించారు. దేశంలో ఏటా 5 లక్షల రోడ్డు ప్రమాదాలు జరుగుతూ 1.8 లక్షలమంది మరణిస్తున్నారనీ, మృతుల్లో 66 శాతం మంది 18-34 ఏళ్ల వయోవర్గంలోనివారని వివరించారు. రోడ్డు ప్రమాదాలకు గురైనవారిని రక్షించే వ్యక్తులను రహదారి వీరులుగా గుర్తించి, తలా రూ.25,000 నగదు బహుమతి ఇస్తామని మంత్రి ప్రకటించారు. అంబులెన్సుల నిర్వహణ జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ పరిధిలోకి రాదనీ, రాష్ట్రాలకు 100 నుంచి 150 అంబులెన్సులివ్వడానికి కేంద్రం సిద్ధంగా ఉందని తెలిపారు. -మిగతా 2లో

## సీఎం చంద్రబాబుకు ప్రతిష్ఠాత్మక అవార్డు... అభినందించిన పవన్ కల్యాణ్

చంద్రబాబుకు ప్రతిష్టాత్మక 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్' పురస్కారం ది ఎకనామిక్ టైమ్స్ అవార్డుపై అభినందనలు తెలిపిన పవన్ కల్యాణ్



# నిధులు లేకున్నా అద్భుతాలు చేయొచ్చు..

- కలెక్టర్ల వినూత్న పథకాలకు సీఎం చంద్రబాబు ఫిదా
- అల్లూరి జిల్లాలో విద్యార్థుల కోసం 'సూపర్ 50' కార్యక్రమం
- పార్వతీపురం మన్యం జిల్లా 'ముస్తాబు'కు సీఎం ప్రశంసలు
- ఏలూరులో నాటుసారా తయారీదారుల కోసం 'ప్రాజెక్టు మార్పు'
- విజయవంతమైన ఈ విధానాలను రాష్ట్రమంతా అమలు చేయాలని ఆదేశం
- వినూత్న ఆలోచనలతో అధికారులు ముందుకొస్తే ప్రోత్సాహం ఉంటుందన్న సీఎం

(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 18)

జిల్లా కలెక్టర్లు తమ పరిధిలో అమలు చేస్తున్న వినూత్న కార్యక్రమాలపై సీఎం చంద్రబాబు ప్రశంసల వర్షం కురిపించారు. అల్లూరి, పార్వతీపురం మన్యం, ఏలూరు జిల్లాల కలెక్టర్లు అమలు చేస్తున్న పథకాలను ప్రత్యేకంగా అభినందించారు. ఇలాంటి విజయవంతమైన విధానాలను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి ప్రవేశపెట్టిన 'ముస్తాబు' కార్యక్రమం తనను ఎంతగానో ఆకర్షించిందని ముఖ్యమంత్రి అన్నారు. నిధులు లేకుండానే అద్భుతాలు చేయవచ్చనడానికి ఈ కార్యక్రమమే నిదర్శనమని కొనియాడారు. విద్యార్థుల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పించే ఈ కార్యక్రమాన్ని రాష్ట్రంలోని 79 లక్షల మంది విద్యార్థులకు చేరేలా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో అమలు చేయాలని సూచించారు. -మిగతా 2లో




## 'ఉపాధి' స్థానంలో 'జీ రామ్ జీ'కి లోక్‌సభ ఆమోదం.. బిల్లు ప్రతులు చించేసిన విపక్ష ఎంపీలు



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,డిసెంబర్ 18)

'మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం' (ఎంజీనరేగా)ను రద్దు చేసి దాని స్థానంలో కొత్త చట్టం తీసుకొచ్చేందుకు ఉద్దేశించిన 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్-గ్రామీణ్' (వీబీ జీ రామ్ జీ) బిల్లుకు లోక్‌సభ గురువారం ఆమోదం తెలిపింది. ఈ బిల్లుపై చర్చ సందర్భంగా విపక్షాలు పెద్దఎత్తున నిరసన వ్యక్తంచేశాయి. వారి ఆందోళన నడుమ స్పీకర్ ఓటింగ్ నిర్వహించగా.. బిల్లు (%జఔ స్త్ర ష్ట్రజుఖ స్త్ర ఔరిజిజి%)కు ఆమోదం లభించింది. ఈ సమయంలో విపక్ష ఎంపీలు వెల్‌లోకి వచ్చి నిరసన చేపట్టాయి. కొందరు ప్రతిపక్ష నేతలు 'వీబీ జీ రామ్ జీ' బిల్లు ప్రతులను చించి విసిరేశారు. ఈ గందరగోళం నేపథ్యంలో లోక్‌సభ శుక్రవారానికి వాయిదా పడింది.అంతకుముందు బిల్లుపై చర్చ సందర్భంగా విపక్షాల ఆరోపణలకు కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ బదులిచ్చారు. మహాత్మాగాంధీ సిద్ధాంతాలకు అనుగుణంగానే మోదీ ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోందన్నారు. "బాపూ సిద్ధాంతాలను కాంగ్రెస్ సర్కారు చంపేసింది. కానీ, ఎన్డీయే ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పనిచేస్తోంది. పీఎం ఆవాస్ యోజన, ఉజ్వల యోజన, స్వచ్ఛభారత్ మిషన్, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాలతో గాంధీజీ కలలను మేం సాకారం చేస్తున్నాం" అని తెలిపారు.

### ఎన్నికల కోసమే గాంధీ పేరు చేర్చి..

ఈ సందర్భంగా గత కాంగ్రెస్ పాలనపై ఆయన విరుచుకుపడ్డారు. "తొలుత ఉపాధి -మిగతా 2లో

## ఇంట గెలిచాం కాబట్టే.. రచ్చ గెలుస్తున్నాం: వెంకయ్యనాయుడు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 18)

ఎవరి కర్తవ్యాన్ని వారు నిర్వర్తిస్తే మన దేశం మరింత ముందుకు




వెళ్తుందని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. ఇప్పటికే గణనీయమైన అభివృద్ధిని సాధించిందని చెప్పారు. కృష్ణా జిల్లా గుడివాడలోని ఏఎన్నార్ కళాశాల వజ్రోత్సవ వేడుకల్లో ఆయన మాట్లాడారు."ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశం భారత్ అని ఐఎంఎఫ్ నివేదిక ఇచ్చింది. అమెరికాలోని ప్రముఖ వైద్యుల్లో సగం మంది భారతీయులే. ఇంట గెలిచాం.. కాబట్టే రచ్చ గెలుస్తున్నాం. సవాళ్లను గుర్తించి ముందుకెళ్లాలి. సంపద, సంక్షేమం అందరికీ అందాలి. 18 శాతం మంది ఇంకా దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారు.. -మిగతా 2లో

## చంద్రబాబు గ్రాఫ్ పడిపోతోందని స్వయంగా ఆయనే చెప్పుకున్నారు: జగన్

### కోటి సంతకాల ఉద్యమం చారిత్రక విజయం అన్న జగన్

(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 18)



చంద్రబాబు ప్రభుత్వంపై వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. 'కోటి సంతకాల ఉద్యమం' చారిత్రక విజయం సాధించిందని, ఇంత పెద్ద సంతకాల ఉద్యమం దేశ చరిత్రలోనే జరగలేదని అన్నారు. ముఖ్యంగా, మెడికల్ కాలేజీలను ప్రైవేటుకు కట్టబెట్టడం అతిపెద్ద స్కాం అని ఆయన ఆరోపించారు.

పార్టీ ముఖ్య నేతలతో ఈరోజు సమావేశమైన ఆయన మాట్లాడుతూ... "ప్రైవేటుకు కాలేజీలు ఇచ్చి, మళ్లీ రూ.120 కోట్ల ప్రజాధనాన్ని జీతాల కింద ఎలా ఇస్తారు? ఇంతకంటే పెద్ద స్కాం ఉంటుందా?" అని ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. ఈ ఉద్యమంలో భాగంగా కోటి 4 లక్షల 11 వేల 136 మంది సంతకాలు చేశారని, ఇది ఒక చరిత్ర అని పేర్కొన్నారు. ఉద్యమాన్ని -మిగతా 2లో

## పోలవరం ప్రాజెక్టు పనులపై ఉండవల్లి అరుణ్ కుమార్ తీవ్ర విమర్శలు

### కూటమి ప్రభుత్వంలో కూడా పోలవరం పరిస్థితి మారలేదన్న ఉండవల్లి

(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 18)

రాష్ట్రంలో కొత్తగా కూటమి ప్రభుత్వం ఏర్పడినా పోలవరం ప్రాజెక్టు పనులు నత్తనడకనే



సాగుతున్నాయని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు తరచూ ప్రాజెక్టును సందర్శించడం వల్ల పనులు వేగవంతం కాకపోగా, మరింత జాప్యం జరుగుతోందని ఆయన ఆరోపించారు. వారి పర్యటనల సమయంలో మొత్తం అధికార యంత్రాంగం అంతా వారి చుట్టూనే తిరగాల్సి వస్తోందని, ఇది పనులపై ప్రభావం చూపుతోందని అన్నారు. ఈరోజు రాజమండ్రిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో -మిగతా 2లో

## ప్రధాని మోదీకి ఒమన్ అత్యున్నత పురస్కారం... 29వ అంతర్జాతీయ గౌరవం

### 'ది ఫస్ట్ క్లాస్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ఒమన్'ను ప్రదానం చేసిన సుల్తాన్

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,డిసెంబర్ 18)



ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తన ఖాతాలో మరో అరుదైన అంతర్జాతీయ గౌరవాన్ని చేర్చుకున్నారు. ఒమన్ పర్యటనలో ఉన్న ఆయనకు ఆ దేశ అత్యున్నత పురస్కారమైన 'ది ఫస్ట్ క్లాస్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ఒమన్'ను సుల్తాన్ హైథమ్ బిన్ తారిక్ గురువారం ప్రదానం చేశారు. గతంలో క్వీన్ ఎలిజబెత్, నెల్సన్ మండేలా వంటి ప్రపంచ ప్రఖ్యాత నేతలకు మాత్రమే ఈ పురస్కారం దక్కింది. రెండు రోజుల క్రితమే ఇథియోపియా అత్యున్నత పురస్కారాన్ని అందుకున్న మోదీకి ఇది 29వ అంతర్జాతీయ గౌరవం కావడం విశేషం.

అంతకుముందు, ప్రధాని మోదీ, ఒమన్ సుల్తాన్ హైథమ్ మధ్య మస్కట్‌లోని అల్ బరకా ప్యాలెస్‌లో ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. ఇరు దేశాల మధ్య సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం కుదరడాన్ని ఇరువురు నేతలు ఒక కీలక మైలురాయిగా అభివర్ణించారు. రక్షణ, భద్రత, వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతికత వంటి పలు అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ పాల్గొన్నారు. -మిగతా 2లో

## 'ఆపరేషన్ సిందూర్' మన సత్తా చాటింది...

### వేగంగా, కచ్చితత్వంతో దాడులు చేయగలం: రాజ్ నాథ్ సింగ్

### ఉగ్రశిబిరాల ధ్వంసంలో వాయుసేన వేగం, కచ్చితత్వం అద్భుతమని ప్రశంస

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,డిసెంబర్ 18)

'ఆపరేషన్ సిందూర్' సమయంలో.. వేగంగా, అత్యంత ప్రభావవంతంగా స్వల్పకాలిక సైనిక చర్యలు చేపట్టగల సత్తాను భారత్ స్పష్టంగా నిరూపించుకుందని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ అన్నారు. భారత వైమానిక దళం సాంకేతికంగా, కార్యాచరణ పరంగా అత్యంత పటిష్ఠమైన శక్తిగా అవతరించిందని ఆయన కొనియాడారు. ఈరోజు ఢిల్లీలో జరిగిన ఎయిర్ ఫోర్స్ కమాండర్ల సదస్సులో ఆయన ఈ




వ్యాఖ్యలు చేశారు.ఈ ఆపరేషన్ సమయంలో ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేయడంలో వాయుసేన చూపిన ధైర్యం, వేగం, కచ్చితత్వాన్ని రాజ్ నాథ్ ప్రత్యేకంగా ప్రశంసించారు. దాడుల అనంతరం పాకిస్థాన్ బాధ్యతారాహిత్యంగా స్పందించిన తీరును కూడా ఐఏఎఫ్ సమర్థవంతంగా ఎదుర్కొందని తెలిపారు. పాక్ దాడులకు ప్రయత్నించినప్పుడు కూడా భారత ప్రజలు ప్రశాంతంగా తమ పనుల్లో నిమగ్నమవడం మన సైనిక సన్నద్ధతపై వారికున్న నమ్మకానికి నిదర్శనమని అన్నారు.రష్యా-ఉక్రెయిన్, ఇజ్రాయెల్-హమాస్ వంటి ఇటీవలి అంతర్జాతీయ ఘర్షణలను ప్రస్తావిస్తూ, ఆధునిక యుద్ధాల్లో వాయుసేనదే నిర్ణయాత్మక పాత్ర అని -మిగతా 2లో

# బంగారం ఆన్ లైన్ కొనుగోలు, అమ్మకాలు నియంత్రణ పై మాగుంట ప్రశ్న

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 18)**

దేశం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో డిజిటల్ బంగారం ఆన్‌లైన్‌లో దేశం, విదేశాల్లో కొనుగోలు, అమ్మకాలు జరుపుటకు నమోదయిన సంస్థలు గత 5 సంవత్సరాలలో భారతీయులు కొన్న బంగారం విలువ, మొత్తం ఫిర్యాదులు, అవగాహన కార్యక్రమాల గురించి పార్లమెంటు సమావేశాలలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నించారు. ఆయన అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయక మంత్రి పంకజ్ చౌదరి సమాధానమిస్తూ దేశం, విదేశాలలో డిజిటల్ బంగారం ఆన్ లైన్‌లో కొనుగోలు, అమ్మకాలు జరిపి సంస్థలను నమోదు చేయబడలేదని, 2020 నుండి 2025 వరకు జాతీయ వినియోగదారుల హెల్ప్ లైన్ (టెలిఫోన్ సేవ) ద్వారా వచ్చిన డిజిటల్ బంగారానికి సంబంధించి దేశం మొత్తంలో వినియోగదారుల నుండి 371 పిర్యాదులు రాగా, ఆంధ్రప్రదేశ్ నుండి 17 వచ్చాయని తెలిపారు. ఆన్ లైన్ డిజిటల్ బంగారం కొనుగోలు మరియు అమ్మకాలపై అవగాహన కల్పనకు ఎలాంటి కార్యక్రమాలు ప్రారంచలేదని, అయితే, భారత సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డు వారు 8-11-2025న బంగారం సంబంధిత ఆర్థిక ఉత్పత్తుల సమాచారం గురించి పత్రికా ప్రకటన ద్వారా ప్రజలకు హెచ్చరిక చేసిందని తెలిపారు. భారత సెక్యూరిటీలు, మార్కెట్ల బోర్డు (సెబి) వారు రిజిస్టరు చేయబడిన మధ్యవర్తి సంస్థల ద్వారానే నియంత్రత బంగారు ఉత్పత్తుల చేయాలని, సెబి గుర్తింపబడని వెలుపల సంస్థల ద్వారాచేస్తే ప్రమాదాలు ఉండునని, సెక్యూరిటీ, స్టాక్ మార్కెట్లో పెట్టుబడిదారుల రక్షణ విదానమేదీ లేదని, అవగాహన కల్పించబడిందని కేంద్ర మంత్రి తెలిపారు.

# క్విస్ కళాశాలలో జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ పోటీలో పాల్గొన్న 14 కాలేజీలు

### హెూరాహెూరీగా సాగిన మ్యాచ్ లు
### మొదటిబహుమతి సెంటాన్స్ చీరాల
### రెండో బహుమతి సాధించిన క్విస్ కళాశాల





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 18)**

ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాలలకు చెందిన 14 జట్లు పోటీల్లో పాల్గొన్నాయని క్విస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీ గాయత్రి దేవి తెలియజేశారు. విద్యతో పాటు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని, క్రీడలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతోనే ఈ పోటీలు నిర్వహించినట్లు తెలియజేశారు. కాగా.. 14 జట్ల మధ్య మొదటి నుంచి పోటీ హెూరాహెూరీగా సాగింది. ఫైనల్స్ లో క్విస్ ఇంజనీరింగ్ కళాశాల జట్టు, చీరాల సెయింటాన్స్ ఇంజనీరింగ్ కళాశాల జట్లు పోటీ పడ్డాయి. హెూరాహెూరీగా గట్టిపోటీ నెలకొన్న ఫైనల్స్ లో సెయింటాన్స్ జట్టు విజయం సాధించింది. క్విస్ ఇంజనీరింగ్ కళాశాల జట్టు రెండో బహుమతి సాధించగా... పేస్ ఇంజనీరింగ్ కళాశాల జట్టు మూడో బహుమతి సాధించినట్లు క్రీడావిభాగం తెలియజేసింది. గెలుపొందిన జట్లకి క్విస్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.వి. హనుమంతరావు ట్రోఫీ, నగదుబహుమతి, ప్రశంసపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన గెలుపొందిన టీమ్ లకి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో డీన్ అకడమిక్స్ డాక్టర్ సత్యమెహర్, క్రీడావిభాగాధిపతి డాక్టర్ కోటేశ్వరరావు, వివిధ విభాగాల హెచ్ వోడీలు, డీన్ లు, డైరెక్టర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల స్పోర్ట్స్ డీన్ డాక్టర్ నవనీతకృష్ణన్ పర్యవేక్షించారు.

మొదటి పేజీ తరువాయి

# రాష్ట్రాలకు కేంద్ర అంబులెన్సులు: గడ్కరీ

**ఉపగ్రహ సాయంతో టోల్ వసూలు**

జాతీయ రహదారులపై ఉపగ్రహ, కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత సుంక వసూలు యంత్రాంగాన్ని 2026 చివరికల్లా ప్రారంభిస్తామని గడ్కరీ చెప్పారు. దీనివల్ల టోల్‌గేట్ల వద్ద వాహనాలు నిరీక్షించాల్సిన అగత్యం తప్పుతుందని పేర్కొన్నారు. ఈ కొత్త పద్ధతి వల్ల ప్రభుత్వానికి రూ.6,000 కోట్ల అదనపు ఆదాయం లభిస్తుందని, వాహనదారులకు రూ.1,500 కోట్ల మేరకు ఇంధనం ఆదా అవుతుందని వివరించారు. గతంలో టోల్‌గేట్‌ల వద్ద సుంకం చెల్లించడానికి 3-10 నిమిషాలు పట్టేదనీ, ఫాస్టాగ్ వల్ల 60 సెకన్లు లేదా అంతకు తక్కువ సమయంలోనే చెల్లింపు జరిగిపోతోందని గడ్కరీ చెప్పారు. కొత్తగా ప్రవేశపెట్టే బహుళ లైన్ల స్వేచ్ఛా రవాణా (ఎంఎల్ఎఫ్ఎఫ్) పద్ధతిలో వాహనాలు క్షణం కూడా ఆగకుండా 80 కిలోమీటర్ల వేగంతో టోల్ గేట్స్ నుంచి దూసుకెళతాయని వివరించారు. దీంతో టోల్ గేట్స్ నిర్వహణ ఖర్చులు తగ్గిపోతాయన్నారు. టోల్‌గేట్ ఆపరేటర్ల అక్రమాలు ప్రభుత్వ దృష్టికి వచ్చాయనీ, వీటి నిరోధానికి గట్టి చర్యలు తీసుకుంటామని గడ్కరీ ప్రకటించారు. ఫాస్టాగ్‌ను వాహనానికి అమర్చకుండా చేతితో పట్టి చూపడం వల్ల నష్టం కలుగుతోందని చెప్పారు. ఈ ఏడాది డిసెంబరు 10 నాటికి ఇలాంటి 6,725 కేసుల వరకు తమ దృష్టికి వచ్చాయన్నారు. చేతితో పట్టే ఫాస్టాగ్‌లను సంబంధిత బ్యాంకు బ్లాక్ లిస్ట్ చేస్తుందని హెచ్చరించారు.

# 'ఉపాధి' స్థానంలో 'జీ రామ్ జీ'కి లోక్‌సభ ఆమోదం.. బిల్లు ప్రతులు చించేసిన విపక్ష ఎంపీలు

హామీ పథకానికి %శ్రీష్ట్రజూస్త్రజు% అనే పేరు ఉండేది. ఆ తర్వాత 2009లో లోక్‌సభ ఎన్నికల సమయంలో ఓటర్లను ఆకర్షించేందుకు నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకానికి మహాత్మాగాంధీ పేరు చేర్చింది. అంతేకాదు.. వారి హయాంలో ఈ పథకం అమలులో అనేక లోటుపాట్లు చోటుచేసుకున్నాయి. కూలీలపై ఎక్కువ ఖర్చు చేసి.. మెటీరియల్ కొనుగోలుకు తక్కువ వెచ్చించారు" అని చౌహన్ మండిపడ్డారు. పేరు మార్పుపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ విమర్శలను ప్రస్తావిస్తూ.. గతంలోనే అనేక పథకాలకు కాంగ్రెస్ గాంధీ-నెహ్రూ పేర్లు పెట్టిన విషయాన్ని గుర్తుచేశారు.పల్లె ప్రాంత నిరుపేదలకు ఉపాధి కల్పించడం ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, గ్రామీణ ప్రాంతాల్లో సుస్థిర ఆస్తుల కల్పన, వనరుల ఉత్పాదకత, అభివృద్ధి లక్ష్యాలుగా దాదాపు రెండు దశాబ్దాల కిందట 'ఎన్ఆర్ఈజీఏ' చట్టాన్ని 2005లో అప్పటి యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చింది. తర్వాత 2009లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంగా పేరు మార్చారు.

# 'ఆపరేషన్ సిందూర్' మన సత్తా చాటింది...

## వేగంగా, కచ్చితత్వంతో దాడులు చేయగలం: రాజ్ నాథ్ సింగ్

రాజ్ నాథ్ సింగ్ అభిప్రాయపడ్డారు. వేగం, కచ్చితత్వంతో ప్రత్యర్థికి స్పష్టమైన వ్యూహాత్మక సందేశం ఇవ్వడానికి వైమానిక శక్తి ఒక కీలక సాధనంగా మారిందని వివరించారు.

21వ శతాబ్దపు యుద్ధాలు సాంకేతికత, ఆలోచనలపై ఆధారపడి ఉంటాయని, సైబర్ వార్‌ఫేర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మానవరహిత వ్యవస్థల ప్రాధాన్యం పెరుగుతోందని తెలిపారు. జాతీయ ఆస్తుల పరిరక్షణకు ప్రధాని మోదీ ప్రకటించిన 'సుదర్శన చక్ర' కీలకమవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. దేశీయంగా జెట్ ఇంజన్ల అభివృద్ధిని జాతీయ మిషన్‌గా ప్రకటించామని గుర్తుచేశారు. 'ఆపరేషన్ సిందూర్' త్రివిధ దళాల మధ్య సమన్వయానికి ఒక అద్భుతమైన ఉదాహరణ అని రాజ్ నాథ్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్, వాయుసేన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సీఎం చంద్రబాబుకు ప్రతిష్ఠాత్మక అవార్డు... అభినందించిన పవన్ కల్యాణ్

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 18)**

ప్రముఖ ఆంగ్ల దినపత్రిక 'ది ఎకనామిక్ టైమ్స్' అందించే ప్రతిష్ఠాత్మక 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్' పురస్కారం ఏపీ సీఎం చంద్రబాబుకు లభించడం పట్ల డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబుకు ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు.చంద్రబాబును ఒక దార్శనిక నేతగా పవన్ కల్యాణ్ అభివర్ణించారు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడం, ఐటీ, గ్రీన్ ఎనర్జీ రంగాలను ప్రోత్సహించడం, పాలనలో సంస్కరణలు తీసుకురావడంలో ఆయన చూపిన చొరవ, కృషి ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఆయన చేపట్టిన కార్యక్రమాలు 'స్వర్ణాంధ్ర 2047' లక్ష్య సాధనకు మార్గం సుగమం చేస్తున్నాయని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

రాష్ట్రం, దేశం అభివృద్ధి పథంలో పయనించేందుకు చంద్రబాబు చేస్తున్న కృషికి మరింత శక్తి చేకూరాలని ఆకాంక్షిస్తున్నట్లు పవన్ కల్యాణ్ తన సందేశంలో తెలిపారు. ఆయన మరిన్ని విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు చెప్పారు.

# ఇంట గెలిచాం కాబట్టే.. రచ్చ గెలుస్తున్నాం: వెంకయ్యనాయుడు

వారిని ఆదుకోవాలి. ఆర్థికంగా, సామాజికంగా, దౌత్యపరంగా దేశం నూతన శకాన్ని ఆవిష్కరిస్తోంది. 9 ఏళ్ల క్రితం 15 శాతానికే పరిమితైన డిజిటల్ వినియోగం.. నేడు 'డిజిటల్ ఇండియా' కార్యక్రమంతో 48 శాతానికి చేరింది. విద్యార్థులు దీనిపై మరింత దృష్టిపెట్టాలి" అని వెంకయ్యనాయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్, మాజీ ఎంపీ కావూరి సాంబశివరావు ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, కామినేని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు గ్రాఫ్ పడిపోతోందని స్వయంగా ఆయనే చెప్పుకున్నారు: జగన్

విజయవంతం చేసిన గ్రామస్థాయి కార్యకర్త నుంచి ప్రతి ఒక్కరికీ ఆయన అభినందనలు తెలిపారు.

చంద్రబాబు గ్రాఫ్ పడిపోతోందని స్వయంగా ఆయనే చెప్పుకున్నారని జగన్ వ్యాఖ్యానించారు. కూటమి పాలనలో రెండు బడ్జెట్‌లు ప్రవేశపెట్టినా ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. తమ హయాంలో అమలు చేసిన ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతు భరోసా వంటి పథకాలను రద్దు చేశారని ఆరోపించారు.ప్రైవేటీకరణ అంటే దోపిడీ అని, విద్య, వైద్యం ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలని జగన్ స్పష్టం చేశారు. తాము ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి బతికించామని, కానీ నేడు అన్ని వ్యవస్థలు తిరోగమనంలో ఉన్నాయని అన్నారు. చంద్రబాబు తన తప్పులను కప్పిపుచ్చుకోవడానికి కలెక్టర్లపైకి నెట్టేస్తున్నారని ఆరోపించారు.

# పోలవరం ప్రాజెక్టు పనులపై ఉండవల్లి అరుణ్ కుమార్ తీవ్ర విమర్శలు

ఉండవల్లి మాట్లాడారు. పోలవరంలో గతంలో దెబ్బతిన్న డయాఫ్రం వాల్ స్థానంలో కొత్తది నిర్మిస్తున్నారని, అయితే గతంలో రూ.440 కోట్లతో డయాఫ్రం వాల్ విఫలం కాగా, అదే బావర్ కంపెనీకి ఇప్పుడు రూ.990 కోట్లతో పనులు ఎలా అప్పగించారని ప్రశ్నించారు. ఈ వైఫల్యంపై ప్రభుత్వం ఎందుకు విచారణ జరపడం లేదని నిలదీశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పిదం వల్లే డయాఫ్రం వాల్ దెబ్బతిందని గత సీఎం జగన్ స్పష్టం చేశారని గుర్తుచేశారు.

పోలవరం డయాఫ్రం వాల్ వైఫల్యంపై నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదికను ఎందుకు బయటపెట్టడం లేదని ఉండవల్లి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సమాచార హక్కు చట్టం కింద నివేదికను అడిగితే 'కాపీరైట్' వర్తిస్తుందని చెప్పడం దారుణమన్నారు. డయాఫ్రం వాల్ కొట్టుకుపోవడం మానవ తప్పిదమా లేక భారీ వరదల వల్ల జరిగిందా అనే విషయాన్ని ప్రభుత్వం స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఇదే సందర్భంగా, గతంలో జరిగిన గోదావరి పుష్కరాల తొక్కిసలాటకు ముహూర్తం అనే మూఢనమ్మకమే కారణమని కమిషన్ తేల్చినా, అప్పట్లో బీజేపీతో పొత్తులో ఉండటం వల్ల టీడీపీ ప్రభుత్వం మౌనంగా ఉందని ఉండవల్లి విమర్శించారు.

# నిధులు లేకున్నా అద్భుతాలు చేయొచ్చు..

అలాగే ఏలూరు జిల్లాలో నాటుసారా తయారీదారుల జీవితాల్లో మార్పు తెచ్చేందుకు కలెక్టర్ వెట్రిసెల్వి అమలు చేస్తున్న 'ప్రాజెక్టు మార్పు' కార్యక్రమాన్ని సీఎం అభినందించారు. ఈ ప్రాజెక్టు ద్వారా 140 గ్రామాల్లో స్పష్టమైన మార్పు కనిపించిందని, వారిని మైక్రో ఎంట్రప్రెన్యూర్లుగా తీర్చిదిద్దుతున్నామని కలెక్టర్ వివరించారు.

అల్లూరి జిల్లాలో పదో తరగతి విద్యార్థుల కోసం కలెక్టర్ దినేశ్ కుమార్ అమలు చేస్తున్న 'సూపర్ 50 ఇన్స్పిరేషన్ ఇంజిన్ ఆఫ్ నిర్మాణ్' కార్యక్రమం ద్వారా ఇప్పటికే 90 వేల మంది గిరిజన విద్యార్థులు లబ్ధి పొందారని తెలుసుకుని సంతోషం వ్యక్తం చేశారు. కుప్పంలో ప్రారంభించిన 'విలువల బడి' కాన్సెప్టును ప్రస్తావిస్తూ, విద్యార్థులకు నాలెడ్జ్‌తో పాటు విలువలు కూడా చాలా ముఖ్యమని సీఎం అన్నారు. టెక్నాలజీని వాడుకుంటూ వినూత్న ఆలోచనలతో ప్రజలకు మేలు చేయాలని, విద్యాశాఖలో మంచి మార్పు తీసుకురావాలని కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు.

# ప్రధాని మోదీకి ఒమన్ అత్యున్నత పురస్కారం... 29వ అంతర్జాతీయ గౌరవం

భారత్, ఒమన్ మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 70 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రధాని మోదీ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పర్యటనతో ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలపడుతుందని నేతలు విశ్వాసం వ్యక్తం చేశారు. తన పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ 'మైత్రీ పర్వ్' కార్యక్రమంలో ప్రవాస భారతీయులను ఉద్దేశించి ప్రసంగించారు. అలాగే, ఇండియా-ఒమన్ బిజినెస్ ఫోరమ్‌లో పాల్గొని, ఒమన్ వ్యాపారవేత్తలు భారత్‌లో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు.

# ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుంది

## వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కేజీ మస్తాన్




**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, డిసెంబర్ 18)**

ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసి పేదల పొట్ట కొట్టే చర్యలకు పాల్పడుతుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కేజీ మస్తాన్ విమర్శించారు. చట్టాన్ని సమూలంగా మారుస్తూ కేంద్ర ప్రభుత్వం చేసిన జీవోకు నిరసనగా మిట్టపాలెం గ్రామంలో కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా కేజీ మస్తాన్ మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చిన తర్వాత గ్రామీణ పేదలకు ఉపాధిని కల్పించిన మంచి చట్టమన్నారు. వ్యవసాయ పనులు పూర్తీ అయిపోయిన తర్వాత కరువుకాలంలో కష్టజీవులకు ఈ చట్టం కడుపు నింపుతుందన్నారు 2025లో వామపక్షాలు, పార్లమెంట్లో బలమైన శక్తిగా ఉన్న క్రమంలో నాటి యూపీఏ ప్రభుత్వం ఈ చట్టం తెచ్చిందన్నారు. పేదరికం నిర్మూలన వలస నివారణ గ్రామీణ ప్రాంతాల్లో నీటి వనరులు శాశ్వత ఆస్తులు సమకూర్చటం పేదల జీవన ప్రమాణాలు మెరుగుపరచటం లాంటి ఉన్నతమైన లక్షణాలతో ఈ చట్టాన్ని ఏర్పాటు చేశారా అన్నారు. ఇప్పటివరకు ఉపాధికి 100 రూపాయలు అయితే 90% కేంద్రం 10% రాష్ట్రప్రభుత్వం బరాయిస్తున్నట్లు తెలిపారు. మార్చినా చట్ట ప్రకారం 60 శాతం కేంద్ర ప్రభుత్వం 40% రాష్ట్ర ప్రభుత్వం నిధులు భరించాల్సి వస్తుంది కనుక మోడీ ప్రభుత్వంలో గాడ్సే గాంధీ, మహాత్ముని చంపేస్తే, మోడీ ప్రభుత్వం గాంధీ మహాత్ముని నామకరణను చంపేయటం దీనిని ఏ విధంగా అర్థం చేసుకోవాలో ప్రజల ఆలోచించాలని కోరుతున్నానన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పారాబత్తిని శ్రీనివాసరావు మాట్లాడుతూ మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి పథకం పేరును మార్చటం దుర్మార్గమన్నారు. ఆర్ఎస్ఎస్ మనోభావాలను మోడీ ప్రభుత్వం వేగంగా ముందుకు తీసుకువస్తుందన్నారు. ఇది దేశానికి పెద్ద ప్రమాదకరమైనటువంటి చర్యలన్నారు. ప్రభుత్వం ఆలోచించాలని, ఇచ్చినటువంటి జీవోను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పి శ్రీనివాసరావు, లక్ష్మీ, సోమయ్య, లక్కి పోగు పరిశుద్ధం, ముప్పరాజు ప్రవీణ్, లక్క పోగు కొండలరావు, దావులూరి దానియేలు, తదితరులు పాల్గొన్నారు.

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
ప్రకాశం

# ఉగ్రతో టిడిపి మరింత బలోపేతం






(షణ్ముఖ వెలుగు, కనిగిరి, డిసెంబర్ 18)

జిల్లా టిడిపి అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించనున్న కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి వలన జిల్లాలో తెలుగుదేశం పార్టీ మరింత బలోపేతం అవుతుందని టిడిపి నాయకులు ఎం చెంచిరెడ్డి, మాజీ ఎంపిటిసి వేమూరి సుబ్బారావులు అన్నారు. ఎమ్మెల్యే ఉగ్రను గురువారం కలిసిన నాయకులు ఆయనకు బొకేలు అందజేసి అభినందనలు తెలిపారు. కనిగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర జిల్లా టీడీపీ బాధ్యతలు తీసుకున్న తర్వాత పార్టీని కూడా మరింత బలోపేతం చేయడం ఖాయమన్నారు. జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఇతర నాయకులు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో 90 శాతం సర్పంచ్‌లు, ఎంపిటిసిలు గెలవడం ఖాయమన్నారు.

# వైసీపీ నుండి టీడీపీలోకి వలసలు



(ఫైల్ ఫోటో )

(షణ్ముఖ వెలుగు, కనిగిరి, డిసెంబర్ 18)

కనిగిరి నియోజకవర్గంలో పార్టీ ఫిరాయింపులు పెరగనున్నాయి. ఇప్పటికే కనిగిరి ఎంపిపి డి ప్రకాశం వైసీపీని వీడి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమక్షంలో టిడిపి కండువా కప్పుకున్నారు. అంతే గాక పీసీపల్లి, చింతగుంపల్లి, సర్పంచ్‌లతో పాటు పలువురు నాయకులు ఎమ్మెల్యే ఉగ్ర సమక్షంలో టిడిపిలో చేరడం జరిగింది. వెలిగండ్ల ఎంపిపి రామణ లక్ష్మీ తిరుపతిరెడ్డి, వైస్ ఎంపిపి భారతిలతో పాటు వెలిగండ్ల మాజీ సింగిల్ విండో అధ్యక్షులు పొల్ల సుబ్రహ్మణ్యంలు టిడిపిలో చేరనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఆ ముగ్గురు నాయకులు తమ అనుచరులతో మంతనాలు సాగిస్తున్నారు. అతి త్వరలోనే జిల్లా పార్టీ అధ్యక్ష బాధ్యతలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి సమక్షంలో పచ్చ కండువా కప్పుకునేందుకు సిద్ధంగా ఉన్నారు. పామూరు మాజీ ఎంపిపి స్వర్గీయ యాదాల శేషగిరిరావు తనయుడు పామూరు మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్ యాదాల వెంకట సాయి తో పాటు పామూరు సర్పంచ్ కూడా టిడిపిలో చేరనున్నారు. యువనేత, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సమక్షంలో పార్టీలో చేరేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. యాదాల వెంకట సాయి ని పార్టీ మారవద్దని వైసీపీ ఇన్‌ఛార్జి దద్దాల నారాయణ యాదవ్ బుజ్జగించినా ఆయన చేసిన ప్రయత్నం ఫలించలేదు. అభివృద్ధే అజెండాగా పని చేస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర తో పని చేసేందుకే టిడిపిలో చేరుతున్నట్లు పలువురు నాయకులు తెలిపారు. కనిగిరి నియోజకవర్గ రజక సంఘ నాయకులు ఎన్ గొల్లపల్లికి చెందిన కొండయ్య కూడా వైసీపీని వీడి టిడిపిలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. కొండయ్య ఇప్పటికే కేటిఆర్ విద్యాసంస్థల అధినేత కుందురు తిరుపతిరెడ్డిని కలిసి పార్టీలో చేరేందుకు అనుమతి కోరినట్లు తెలిసింది. స్థానిక సంస్థల ఎన్నికల నాటికి వైసీపీని వీడి టిడిపిలో చేరే వారి సంఖ్య రోజురోజుకు పెరిగే అవకాశాలు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు చర్చించుకుంటున్నారు.

# గ్రోత్ సెంటర్ వద్ద చెత్త తొలగింపు




## రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రకాశం ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు చొరవ

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 18)

రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త కారణంగా బస్సులు, ఇతర వాహనాలు రోడ్డుపైనే ఆగి ట్రాఫిక్ అంతరాయం ఏర్పడటంతో పాటు ప్రమాదాలకు అవకాశం ఉన్న మద్దిపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రోత్ సెంటర్ (బ్లాక్ స్పాట్) ప్రాంతంలో జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు స్వయంగా పరిశీలన చేసి తక్షణ చర్యలు చేపట్టడంతో ప్రమాదాల నివారణకు అనుకూలమైన పరిస్థితులు ఏర్పడ్డాయి. రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా జిల్లా ఎస్పీ మంగళవారం మద్దిపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రోత్ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పారిశ్రామిక వాడలో పనిచేస్తున్న మహిళలు, పురుషులు వివిధ ప్రాంతాల నుండి వచ్చి వెళ్లే సమయంలో రోడ్డుపైనే నిలబడి బస్సులు ఎక్కడం, బస్సులు కూడా రోడ్డు పైనే ఆగడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని, ప్రమాదాలు సంభవించే అవకాశం ఎక్కువగా ఉందని గమనించారు. అక్కడ ప్రయాణికులు కూడా సమస్యను జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకొని వచ్చారు. ఆర్టీసి అధికారులతో మాట్లాడి బస్సును మార్జిన్‌లో అపే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇదిలా ఉంటే మార్జిన్‌లో చెత్త చెదారం పేరుకుపోవడం వల్ల వాహనాలు అక్కడ నిలపలేక రోడ్డుపైనే ఆగాల్సి వస్తోందని జిల్లా ఎస్పీ గుర్తించారు. ఈ పరిస్థితి వలన ప్రయాణికులకు, వాహనదారులకు ప్రమాదాలు జరిగే అవకాశముందని సంబంధిత పోలీస్ అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఒంగోలు డిఎస్పీ ఆర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఒంగోలు రూరల్ సీఐ యన్ శ్రీకాంత్ బాబు, మద్దిపాడు ఎస్ఐ వెంకట సూర్య వెంటనే స్పందించి, జెసిబిల సహాయంతో రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని పూర్తిగా తొలగించారు. శుభ్రం చేసిన ప్రదేశంలో ఇకపై చెత్త వేయకుండా స్థానిక ప్రజలకు అక్కడ ఉన్న షాపులు వాళ్లకు అవగాహన కల్పించడంతో పాటు, అక్కడ చెత్త వేయకుండా పలు సూచనలు చేశారు. చెత్త తొలగించిన





అనంతరం, ఆ ప్రాంతాన్ని బస్సులు మరియు ఇతర వాహనాలు సురక్షితంగా ఆగేందుకు అనుకూలంగా ఉంది. ఇకపై బస్సులు సర్వీస్ రోడ్లలో ఆగే విధంగా, ప్రయాణికులు రోడ్డు మీదకు రావాల్సిన అవసరం లేకుండా బస్సు ఎక్కే విధంగా, దిగే విధంగా చర్యలు తీసుకున్నారు. దీంతో ట్రాఫిక్ అంతరాయం తగ్గడంతో పాటు, ప్రమాదాల అవకాశాలు కూడా గణనయంగా తగ్గుతుంది. జిల్లా ఎస్పీ చొరవతో చేపట్టిన ఈ చర్యల వల్ల ఆ ప్రాంతంలో పనిచేసే కార్మికులు, ప్రయాణికులు, వాహనదారులు సురక్షితంగా రాకపోకలు సాగించగలుగుతారని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. రోడ్డు భద్రతపై జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది.

# 5వ కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న జిల్లా కలెక్టర్, ఎస్పీ



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 18)

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన గురువారం అమరావతి సచివాలయంలో జరిగిన 5వ కలెక్టర్ల సదస్సులో ప్రకాశం జిల్లా నుండి జిల్లా కలెక్టర్ పి రాజాబాబు, జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు పాల్గొన్నారు. రాష్ట్ర అభివృద్ధి క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాల అమలు, శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా నిర్వహించిన ఈ సదస్సులో జిల్లాకు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. లా అండ్ ఆర్డర్ అంశం పై రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా, హోం శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ కుమార్ విశ్వజిత్ వివరించారు. సామాన్యుడికి ప్రభుత్వ సేవలు మరింత చేరువయ్యేలా చూడాలని, పాలనలో పారదర్శకతకు పెద్దపీట వేయాలని ముఖ్యమంత్రి ఇచ్చిన దిశానిర్దేశం పై చర్చించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, పలు అంశాల పై జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు సమావేశంలో వివరించారు. ఈ సదస్సులో తీసుకున్న నిర్ణయాలను అనుసరించి, జిల్లా యంత్రాంగం సమన్వయంతో పని చేస్తూ అభివృద్ధి లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు కృషి చేస్తామని జిల్లా కలెక్టర్, ఎస్పీ పేర్కొన్నారు.

షణ్ముఖ వెలుగు
ePaper
www.shanmukhavelugu.com



# బాలికల హాస్టల్ సమస్యల పై మండల తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేత

### చీమకుర్తిలోని బాలికల హాస్టల్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలి



(షణ్ముఖ వెలుగు, చీమకుర్తి, డిసెంబర్ 18)

చీమకుర్తి లోని ఎస్సీ బాలికల హాస్టల్‌కు కొత్త భవనాన్ని కేటాయించడం జరిగింది. బిల్డింగ్ యొక్క పనులు 10% మాత్రమే పూర్తి అయ్యాయి. వచ్చే విద్యా సంవత్సరానికి కూడా పూర్తి అయ్యే అవకాశం తక్కువ ఉండటంతో వారికి వేరొక ఆల్టర్నేటివ్ బిల్డింగ్ ను కేటాయించడం జరిగింది. ఆ బిల్డింగ్ ను ఎస్ఎఫ్ఐ టీం సందర్శించడం జరిగింది. అంతేగాక అక్కడ ఉండే పిల్లలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకోవడం జరిగింది. కేటాయించిన ఆ బిల్డింగ్ లో వాష్ రూమ్స్ శుభ్రంగా లేకపోవడం,ఫుడ్ విషయంలో నాణ్యత లోపాలు ఉండటం తరచూ జరుగుతుంటాయి అని పిల్లలతో మాట్లాడి తెలుసుకొని ఆ సమస్యలను పరిష్కరించాలని, బాలికల హాస్టల్ నూతన భవనాన్ని శరవేగంగా పూర్తి చేయాలని కోరుతూ చీమకుర్తి మండల తహసీల్దార్‌కు ఎస్ఎఫ్ఐ చీమకుర్తి మండల కమిటీ ఆధ్వర్యంలో వినతి ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయక కార్యదర్శి జి దేవరాజు, మండల నాయకులు ఈ శ్రీకాంత్, బెల్లిగ్రామ్, సాయి, రనబీర్, తదితరులు పాల్గొన్నారు.

# 21న పల్స్ పోలియో



(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, డిసెంబర్ 18)

ఈ నెల 21న పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైద్య అధికారి డాక్టర్ కృష్ణ చైతన్య తెలిపారు. గురువారం ప్రాథమిక వైద్యశాల ఆవరణలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో కృష్ణ చైతన్య మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలలో గల ఐదు సంవత్సరముల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు అందించాలని మండలంలో 25 పోలియో కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలో మొత్తం 3006 మంది పిల్లలు ఉన్నారని వారి అందరికీ పోలియో చుక్కలు అందించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మండల స్థాయి విద్య వైజ్ఞానిక ప్రదర్శన



(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, డిసెంబర్ 18)

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యాశాఖ అధికారి చంద్రబాబు ఆధ్వర్యంలో విద్య వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డాక్టర్ పి సుజాత మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని, వాటి అనువర్తనాలను ఉపయోగించుకోవాలని విద్యార్థులకు తెలిపారు. మండలంలో 17 ప్రదర్శనలు తీసుకురాగా వాటిలో జిల్లా స్థాయికి 8 ప్రదర్శనలు పంపించడం జరిగిందని విద్యాశాఖ అధికారి చంద్రబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు వై వెంకటేశ్వర్లు, శివరామకృష్ణ, మాధవరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మెప్మా ఆర్‌పిలకు ఒక రోజు సామర్థ్యాల పెంపు శిక్షణ కార్యక్రమం

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 18)



స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ వారి ఆదేశల మేరకు గురువారం ఒంగోలు నగర పాలక సంస్థ కౌన్సిల్ హాల్ నందు ఒంగోలు మునిసిపల్ కార్పొరేషన్ పరిధి లోని మెప్మా ఆర్. పి లకు ఒకరోజు సామర్థ్యాల పెంపు శిక్షణ కార్యక్రమం స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ వారు నియమించిన నాలెడ్జ్ పార్ట్నర్స్ అయిన ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ వారిచే నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ ఘన వ్యర్థాల నిర్వహణ పురపాలక సంఘం నందు ఎంతో కీలకమైనదని, వీటి గురించి క్షుణ్ణంగా తెలుసుకుని ఆచరిస్తే చెత్త నుండి సంపద పొందవచ్చునని, ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరు నిబద్ధతతో అభ్యసించాలని కోరారు. మరియు స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ ఒంగోలు గా తీర్చిదిద్దాలంటే, అందరూ చెత్తను వేరుచేసి మున్సిపల్ సిబ్బంది వారు వచ్చినప్పుడు వారికి అందించాలని స్వచ్ఛత విషయంలో అందరూ బాధ్యత వహిస్తే స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ ఒంగోలు గా తీర్చిదిద్దవచ్చు అని అన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం లో మరో ముఖ్య అతిధి నగర కమీషనర్ డా " కె. వెంకటేశ్వర రావు ఈ సందర్భంగా ఘన వ్యర్థాల నిర్వహణ తడి పొడి హానికర ప్లాస్టిక్ వేస్ట్ , ఈ వేస్ట్ నిర్వహణ గురించి విరివిగా అవగాహన కల్పించి, వార్డులో ఏ విధంగా నిర్వహించాలి అనే అంశాలును తెలియజేయడం జరిగింది. యం.యస్.డబ్ల్యూ బల్క్ వేస్ట్ జనరేటర్స్ వేస్ట్ ప్రాసెసింగ్ టెక్నాలజీ, యం.యస్.డబ్ల్యూ రూల్స్ 2016 తదితర విషయాల పైన శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ నుండి రిసోర్స్ పర్సన్స్ గా డాక్టర్ కె శ్రీనివాస్, హరీష్ ఇందులో పాల్గొని శిక్షణ ఇవ్వటం జరిగింది. అనంతరం ఒంగోలు నగర పాలక సంస్థ కార్యాలయాన్ని ప్లాస్టిక్ ఫ్రీ జోన్‌గా నగర మేయర్ ప్రకటిస్తూ గోడ పత్రికలు విడుదల చేయడం జరిగింది. ప్రజల్లో మార్పు రావాలంటే ముందుగా మన ప్రవర్తనలో మార్పు రావాలని నగర కార్పొరేషన్ సిబ్బందికి అల్ ఇండియా ఇన్స్టిట్యూట్ అఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ వారి సహకారం తో స్టీల్ వాటర్ బాటిల్స్ మేయర్, కమీషనర్ చేతులు మీదగా పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ మెప్మా సిఎంఎం సంతోష్, సిఓలు, ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ సిబ్బంది, పాల్గొన్నారు.





# ఒంగోలులో జరిగే ఏబీవీపీ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

## బీజేపీ నేత డాక్టర్ ఏలూరి పిలుపు

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, డిసెంబర్ 18)

ఒంగోలు పట్టణంలో ఈ నెల 18 నుండి 20 వ తేదీ వరకు మూడు రోజులపాటు జరుగనున్న అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) 44 వ రాష్ట్ర మహాసభలను విద్యార్థులు, యువత, విద్యావేత్తలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏబీవీపీ కార్యకర్తగా పనిచేసే అదృష్టం తనకు దక్కిందని అన్నారు. నేటి విద్యార్థులే రేపటి భావి భారత పౌరులని, దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందని , విద్యార్థుల్లో దేశభక్తి, జాతీయత, సామాజిక బాధ్యతను పెంపొందించడంలో ఏబీవీపీ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. ఏబీవీపీని స్థాపించిన నాటి నుంచి విద్యార్థి సమస్యల పరిష్కారం, విద్యా వ్యవస్థలో నాణ్యత, విలువలతో కూడిన విద్య, జాతీయ భావజాలాన్ని పెంపొందించడమే లక్ష్యంగా పనిచేస్తోందని తెలిపారు. విద్యార్థులను కేవలం ఉద్యోగావకాశాలకే పరిమితం చేయకుండా, దేశ నిర్మాణంలో భాగస్వాములుగా తీర్చిదిద్దడమే ఏబీవీపీ ఆశయం అని అన్నారు. ప్రస్తుత కాలంలో విద్యా రంగం అనేక సవాళ్లను ఎదుర్కొంటున్న నేపథ్యంలో, ఈ రాష్ట్ర మహాసభలు విద్యార్థుల భవిష్యత్ దిశను నిర్ణయించే కీలక వేదికగా నిలవనున్నాయని చెప్పారు. విద్యా విధానాలు, యువత పాత్ర, జాతీయ అభివృద్ధి, సమాజంలో విద్యార్థుల బాధ్యత వంటి అంశాలపై ఈ మహాసభల్లో విస్తృతంగా చర్చలు జరగనున్నాయని తెలిపారు. ఒంగోలు నగరంలో ఈ మహాసభలు జరుగుతుండటం గర్వకారణమని, జిల్లా ప్రజలు, విద్యాసంస్థలు, విద్యార్థులు సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు ఈ మహాసభల్లో పాల్గొననున్నారని, ఇది ప్రకాశం జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకువస్తుందని ఏపి బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి ఏలూరి రామచంద్రారెడ్డి తెలిపారు.




# చిట్టెంశెట్టి కృష్ణారావుకు అభినందన వెల్లువ

(షణ్ముఖ వెలుగు, పొదిలి, డిసెంబర్ 18)

బుధవారం పట్టణంలోని పెన్షనర్స్ భవనం నందు జరిగిన పెన్షన్స్ దినోత్సవ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు చిట్టెంశెట్టి వెంకట కృష్ణారావు ముఖ్య అతిథిగా పాల్గొని 75 సంవత్సరాలు పూర్తి చేసుకొన్న విశ్రాంత ఉద్యోగులందరిని ప్రేమాభిమానాలతో సత్కరించారు. అందరూ ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగులందరూ ఆనందోత్సహాలతో చిట్టెంశెట్టి వెంకట కృష్ణారావుకి అభినందనలు, ధన్యవాదాలు తెలియజేసి కృష్ణారావును శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించి నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ తనకు తల్లిదండ్రులతో సమానమైన రిటైర్డ్ ఉద్యోగులను సత్కరించుకునే అవకాశం కలిగినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. తనకు ఇదొక అదృష్టమని తెలియజేసి, విశ్రాంత ఉద్యోగులకు ఏ సమస్య వచ్చినా తాను అందుబాటులో ఉండి తన వంతు సహాయ, సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షులు ఏ బాదుల్లా, ప్రధాన కార్యదర్శి షేక్ మదార్ వలి, అసోసియేటెడ్ అధ్యక్షులు ఏ వీరారెడ్డి, కోశాధికారి చిట్టెంశెట్టి సుబ్బారావు, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు దాసరి గురుస్వామి, కె యలమందరెడ్డి, రిటైర్డ్ డిప్యూటీ డిఇఓ లక్ష్మయ్య, రిటైర్డ్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఆల్లచెరువు విక్రమార్క్, పంచాయతీ డిప్యూటీ ఆఫీసర్ జి నాగేశ్వరరావు, పొదిలి, కొనకనమిట్ల, మర్రిపూడి మండలాల విశ్రాంత ఉద్యోగులు వందల సంఖ్యలో పాల్గొన్నారు.





# ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకునేందుకు ఉద్యమించాలి

## వ్యవసాయ కార్మిక, సిఐటియు, రైతు, కౌలు రైతు సంఘాల పిలుపు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 18)

ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకునేందుకు ప్రజలు ఉద్యమాలకు సిద్ధం కావాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం రమేష్, రైతు సంఘం జిల్లా సీనియర్ నాయకులు పెంట్యాల హనుమంతరావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి బాలకోటయ్య పిలుపు నిచ్చాయి. గురువారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో నాలుగు సంఘాల సంయుక్త సమావేశం నెరుసుల వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. అనంతరం నిరసన కార్యక్రమాలకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి చట్టం రాకముందు అనేక దశాబ్దాలుగా గ్రామీణ పేదలకు పనైనా చూపండి, తిండి అయినా పెట్టండి అని పోరాటాలు జరిగాయని తెలిపారు. 2005లో వామపక్షాలకు చెందిన 62 మంది ఎంపీలు పార్లమెంట్లో బలమైన శక్తిగా ఉన్న సమయంలో ఆనాటి యూపీఏ 18 మందికి మంత్రి పదవులు ఇస్తామని ప్రతిపాదన చేయగా వాటిని కాదని, గ్రామీణ పేదలకు ఉపాధి గ్యారెంటీ చట్టం కావాలని వామపక్షాలు కోరాయని తెలిపారు. ఫలితంగా నాటి యూపీఏ ప్రభుత్వం ఈ చట్టాన్ని తెచ్చిందని తెలిపారు. పేదరిక నిర్మూలన, వలసల నివారణ, గ్రామీణ ప్రాంతాల్లో నీటి వనరులు, శాశ్విత ఆస్తులు సమకూర్చటం, పేదల జీవన ప్రమాణాలు మెరుగుపరచడం లాంటి ఉన్నతమైన లక్ష్యాలతో ఈ చట్టాన్ని ఏర్పాటు చేశారని అన్నారు. ఈ చట్టం వచ్చాక గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలు కొంత మెరుగయ్యాయని, వలసలు పేదరికం కొంతైనా నివారించబడిందని తెలిపారు.

గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న కూలీలతో పాటు మధ్యతరగతి రైతు కుటుంబాల నుండి కూడా ఈ పనులు చేస్తున్నారని ఫలితంగా గ్రామ ప్రజల జీవితం మెరుగుపడటానికి, ప్రజల కొనుగోలు శక్తికి, దేశ ఆర్థిక అభివృద్ధికి దోహద పడిందని వారు తెలిపారు. మహాత్మా గాంధీ గ్రామ స్వరాజ్యాన్ని కోరుకున్నారని, దేశ అభివృద్ధికి గ్రామ సీమలు పట్టుగొమ్మలని ఆయన ఆకాంక్షించారని తెలిపారు. ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ చట్టానికి నాటి ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంగా రూపొందించిందని తెలిపారు. ఆ మహాత్ముని హత్య గావించిన ఆర్ఎస్ఎస్, మతోన్మాద బృందం కేంద్రంలో అధికారంలో ఉండటంతో మహాత్ముని పేరుతో ఉన్న చట్టాన్ని కూడా చంపేస్తున్నారని అన్నారు. (మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం) గా ఉన్న దాన్ని, వికసిత భారత్ రోజుగార్ అజీవిక మిషన్( గ్రామీణ)) గా మార్చుతున్నారని తెలిపారు. చట్టాన్ని పేదలకు వ్యతిరేకంగా మార్చుతూ, పేరు మార్పు వివాదాన్ని సృష్టించారని అన్నారు. మహాత్మా గాంధీ పేరును మార్చటాన్నీ తప్పు పడుతూనే, చట్టంలో పేదలకు వ్యతిరేకంగా మార్చిన అంశాలను కూడా విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తామని, ప్రజా ఉద్యమాలను ఉధృతం చేయడానికి సిద్ధమవుతామని వారు అన్నారు. నేడు చట్టంలో మార్పులు చేయటమే కాదని, కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక క్రమంగా ఈ చట్టాన్ని నిర్వీర్యం చేసే చర్యలకు పాల్పడుతూనే ఉన్నదని అన్నారు. ఇప్పటికే రెండు పూటలా పని చేయాలంటూ జీవో తెచ్చారని తెలిపారు. పని ప్రదేశంలో నెట్వర్క్ లేకపోయినా రెండుసార్లు ఫోటోలు తీయాలని ఆ ఫోటో ఉంటేనే వేతనాలు ఇస్తామనటం, నెలల తరబడి వేతనాలు పెండింగ్ పెట్టడం లాంటి చర్యలతో చట్టాన్ని బలహీనపరిచారని అన్నారు. నేడు పూర్తిగా చట్టం రూపురేఖలు మార్చి పేదల పొట్ట కొట్టే చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. ఇప్పటివరకు ఉపాధికి 90 శాతం కేంద్రం, 10 శాతం రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తూ ఉండేదని, దాన్ని 60 మరియు 40 గా మార్చారనీ అన్నారు. 40% నిధులు రాష్ట్ర ప్రభుత్వాలు భరించాలంటే చాలా కష్టంతో కూడిన పని అవుతుందన్నారు. ఫలితంగా రాష్ట్రాలు నిధులు కేటాయించలేక చట్టం అమలు జరిగే అవకాశాలు ఉండవని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కేంద్ర ప్రభుత్వం చేసిన ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించాలని వారు డిమాండ్ చేశారు. చట్టాన్ని కాపాడుకునేందుకు విస్తృతంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ప్రజలు, ప్రజా సంఘాలకు వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు గంగవరపు రమేష్ బాబు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఉబ్బా వెంకటేశ్వర్లు, పి. శ్రీను, సుబ్బారావు పాల్గొన్నారు.

# పేద విద్యార్థులకు చేయూతనందించిన కిరణ్, జగన్



(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, డిసెంబర్ 18)

మండలంలోని జగన్నాథపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రకాశం జిల్లా వాసవి క్లబ్ గవర్నర్ గంగిశెట్టి కిరణ్కుమార్ 150 లాంగ్ నోట్ పుస్తకాలను ఉచితంగా అందజేశారు. అలాగే కేసెట్టి జగన్ 50 స్మాల్ నోటుబుక్స్, పెన్స్ అందించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కేసెట్టి జగన్ మాట్లాడుతూ ప్రభుత్వం నూతనంగా విద్యార్థులకు 75 రోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేయమని కోరగా దానికి సంబంధించి ఒక్కొక్క విద్యార్థికి మూడు నోట్ బుక్స్ అవసరమని తెలియజేయగా కిరణ్ కుమార్ వెంటనే స్పందించి నేను ఇస్తానని ముందుకు వచ్చారని తెలియజేశారు. రూ.4500ల విలువ గల పుస్తకాలను దాత గంగిశెట్టి కిరణ్ కుమార్ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా జగన్ బాబు మాట్లాడుతూ నేను ఏ కార్యక్రమం తలపెట్టిన మా మిత్రులు నేను సైతం అంటూ ముందుకు వచ్చి సహాయం చేయడం చాలా ఆనందాన్ని ఇస్తుందని తెలియజేశారు. సమాజంలో ప్రతి ఒక్కరూ తమకున్న దానిలో ఎంతో కొంత సేవా కార్యక్రమాలకు ఉపయోగించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయిని ఎం అనూష పాల్గొన్నారు. ఉచితంగా పుస్తకాలు అందించిన కిరణ్ కుమార్, జగన్ ని గ్రామస్తులు అభినందించారు.




# బీమా రంగంలో యఫ్‌డిఐ ప్రజలకు నష్టం

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 18)

ప్రజలకు నష్టం కలిగించే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడలను ఇన్సూరెన్స్ రంగంలోకి వంద శాతం అనుమతించడాన్ని వ్యతిరేకించాలని ఐ.సి.ఇ.యు నెల్లూరు డివిజన్ ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. బీమా రంగంలో వంద శాతం యఫ్.డి.ఐ ప్రవేశానికి అనుమతినిస్తూ పార్లమెంటులో బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ (ఐ.సి.ఇ.యు.) ఒంగోలు బ్రాంచి కమిటి ఆధ్వర్యంలో గురువారం నాడు ఒంగోలు ఎల్ఐసి ఆఫీస్ వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న చట్టాలు ఇన్సూరెన్స్ కంపెనీలలో పెట్టే ప్రజల డబ్బులకు గ్యారంటీ ఉంటుందని అన్నారు. కానీ కొత్త ఇన్సూరెన్స్ బిల్లు అమలులోకి వస్తే ప్రజల డబ్బులకు భరోసా వుండదన్నారు. కావున ఈ బిల్లును వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యం.రమేష్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ఒకవైపు కార్మిక చట్టాలు రద్దు చేస్తూ మరోవైపు ప్రజలకు నష్టం కలిగించే విధానాలు అవలంబిస్తుందన్నారు. పోరాటాల ద్వారా వీటిని తిప్పి కొట్టాలాని అన్నారు. ఈ ధర్నాకు ఎల్ఐసి క్లాస్ వన్ ఆఫీసర్స్ యూనియన్ నాయకులు కె.నాగేశ్వరరావు, యునైటెడ్ ఫోరమ్ అఫ్ బ్యాంక్ యూనియన్స్ ప్రకాశం జిల్లా కన్వీనర్ రాజీవ్ రతన్ దేవ్, ఎల్ఐసి ఎఓఐ డివిజన్ సహాయ కార్యదర్శి పి.ఆంజనేయులు సంఘీబావం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐసిఇయు బ్రాంచి అధ్యక్ష, కార్యదర్శులు యస్.వి.యస్. మల్లిఖార్జున రావు, బి. కేశవరావు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# యుటిఎఫ్ నూతన కమిటీ ఎన్నిక అధ్యక్షులుగా షేక్ ఖాసీంపీరా



(షణ్ముఖ వెలుగు, కంభం, డిసెంబర్ 18)

కంభం మండల యూటీఎఫ్ ఎన్నికలు గురువారం విజయవంతంగా పూర్తయ్యాయి. నూతన కమిటీ అధ్యక్షుడిగా షేక్ ఖాసీంపీరా ఎన్నికయ్యారు. స్థానిక కంభం ఎంపిపిఎస్ ఏఏ పాఠశాలలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కేశవ, అధ్యక్షుడిగా షేక్ ఖాసింపీరా, ప్రధాన కార్యదర్శిగా కోలా సునీల్ కుమార్, సహాధ్యక్షుడిగా వై వేణుగోపాల్ చారి, సహాధ్యక్షురాలిగా యం సలీమా, కోశాధికారిగా డి రాజా కృష్ణలు ఎన్నికయ్యారు. సభ్యుల సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో అందరి సమ్మతితో కమిటీని ఎంపిక చేశారు.

# మహాసభలను జయప్రదం చేయండి





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 18)

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర 44వ మహాసభలు రేపు అనగా 19, 20, 21 తేదీల్లో ఒంగోలులోని విష్ణుప్రియ కన్వెన్షన్ హాలులో ఉదయం 11 గంటల నుంచి ప్రారంభం అవును. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఒరిస్సా రాష్ట్ర గవర్నర్ కంభంపాటి హరిబాబు, రాష్ట్ర చీఫ్ ఇన్ఫర్మేషన్ మాజీ కమిషనర్ హిరాలాల్ సమారియ, ఆర్ఎస్ఎస్ సహ ప్రాంత ప్రచారక్ జనార్ధన్ , అఖిలభారత సహ సంఘటన కార్యదర్శి బాలకృష్ణ, తదితర పెద్దలు, రాష్ట్ర, జాతీయ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

# చంద్రబాబుకు అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే దామచర్ల

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 18)

బిజినెస్ రీఫార్మర్ ఆఫ్ ద ఇయర్'గా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి అవార్డు ప్రకటించింది ఎకనామిక్ టైమ్స్ సంస్థ. ఈ సందర్భంగా ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు చంద్రబాబునాయుడుకు అభినందనలు తెలిపారు. ఈ అవార్డు ఆంధ్రప్రదేశ్‌కు ఎంతో ప్రతిష్టాత్మకం, దేశంలో సంస్కరణల ప్రయాణాన్ని స్పష్టత, ధైర్యం, స్థిరత్వంతో ముందుకు తీసుకెళ్లిన అరుదైన నాయకుల్లో చంద్రబాబు ఒకరని జ్యూరీ ప్రశంసించింది. పాలనలో సంస్కరణలు, వేగం, విశ్వాసం అనే మూడు సూత్రాలపై ఆయన చూపిన అచంచల నిబద్ధతకే ఈ అవార్డు నిదర్శనం. రాష్ట్రాభివృద్ధికి, పెట్టుబడుల ఆకర్షణకు, సంస్కరణాత్మక పాలనకు చంద్రబాబు నాయకత్వం దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలుస్తోంది. సంస్కరణలే మార్గం, పాలనలో విశ్వాసమే మా లక్ష్యం అని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు అన్నారు.

# చంద్రబాబు నాయుడు ను కలిసిన ఎంపి మాగుంట



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 18)

ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనలో భాగంగా గురువారం ఢిల్లీ ఎయిర్ పోర్ట్‌లో ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడిడ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా "బిజినెస్ రీఫార్మర్ ఆఫ్ ద ఇయర్" గా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి అవార్డు దక్కడం పై ముఖ్యమంత్రికి అభినందనలు తెలియజేశారు.

# మార్కాపురంను జిల్లా చేయడం అభినందనీయం టిడిపి నాయకులు



(షణ్ముఖ వెలుగు, పొదిలి, డిసెంబర్ 17)

మార్కాపురంను జిల్లా చేయడం అభినందనీయమని టిడిపి నాయకులు పేర్కొన్నారు. మార్కాపురంను జిల్లాగా ప్రకటించడం పట్ల మండలంలోని ఓబులక్కపల్లి గ్రామ పంచాయతీలో గురువారం మండల టిడిపి శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. ఎన్నికల ముందు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిలు ఇచ్చిన తమ మాటకు కట్టుబడి మార్కాపురంను జిల్లా చేశారన్నారు. దీంతో వెనుకబడ్డ మార్కాపురం నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందన్నారు. అందుకు కృతజ్ఞతగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు దోర్నాల అంజిరెడ్డి, పట్టణ అద్యక్షులు ముల్లా ఖుద్దూస్, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి అవులూరి యలమంద, మాదాలవారిపాలెం సొసైటీ ప్రెసిడెంట్ యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, జిల్లా ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ రసూల్ మహమ్మద్, రాజు, తానికొండ వెంకట్రావు, పట్టణ, మండల, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# టీచర్లకు టెట్ రద్దు చేయాలి విద్యా హక్కు చట్టం సవరించాలి

## ఉపాధ్యాయ సమస్యల పై ధర్నా
## యుటిఎఫ్ ప్రకాశం జిల్లా అధ్యక్షులు షేక్ అబ్దుల్ హై






(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 18)

యుటిఎఫ్ ప్రకాశం జిల్లాశాఖ జిల్లా అధ్యక్షులు షేక్ అబ్దుల్ హై అధ్యక్షతన ప్రకాశం జిల్లా కలెక్టరేట్ వద్ద వివిధ ఉపాధ్యాయ సమస్యల పై ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొమ్ముజు శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై సీనియర్ టీచర్లకు 2010 ముందు అపాయింట్ అయిన టీచర్లకు టెట్ రద్దు చేయాలని ఆ మేరకు విద్యా హక్కు చట్టం సవరించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలని, ఎస్ఎస్‌సి 100 డేస్ ప్రోగ్రాంలో విద్యార్థుల శారీరక మానసిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఆదివారాలు, సెలవు రోజులలో క్లాసులు రద్దు చేయాలని, ఎఫ్ ఎల్ ఎన్ 75 రోజుల ప్రోగ్రాం అమల్లో కూడా విద్యార్థులకు స్వేచ్ఛగా వారికి రాని అంశాలు నేర్పించే అవకాశం కల్పించాలని, సింగిల్ టీచర్లు సెలవులు విషయంలో ఓహెచ్ లు ఉపయోగించుకొనే విషయంలో పడుతున్న ఇబ్బందులను తొలగించాలన్నారు. గురుకుల సంక్షేమ పాఠశాలలో ఉపాధ్యాయుల పట్ల ఆ శాఖ పై అధికారుల నుండి కింద అధికారుల వరకు వ్యవహరిస్తున్న తీరు మార్చుకోవాలన్నారు. జిల్లాలో కొన్ని మండలాల్లో ఎంఈఓ లు టీచర్ల పట్ల ప్రత్యేకించి మహిళా ఉపాధ్యాయుల పట్ల వ్యవహరిస్తున్న తీరు సరి చేసుకోవాలలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి డి వీరాంజనేయులు మాట్లాడుతూ ఎఫ్ ఎల్ ఎన్ 100 రోజులు ప్రోగ్రాం పర్యవేక్షణకు విద్యాశాఖ అధికారులు కాకుండా వేరే డిపార్ట్మెంట్ వారిని నియమించడం యుటిఎఫ్ సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది అదే విధంగా ఉపాధ్యాయుల మీద మానసిక ఒత్తిడి గురిచేస్తూ ఆదేశించడం సరికాదని అన్నారు. జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ హై మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు ఉపాధ్యాయులకు సుమారు 30 వేల కోట్ల రూపాయలుబకాయిలు ఉన్నాయని, 12వ పీఆర్‌సీ కమిషన్ వేయాలని ,అయ్యార్ 30% ప్రకటించాలని ఉపాధ్యాయులకు చెల్లించవలసిన సరెండర్ లివ్ ప్రకటించాలని ఉపాధ్యాయులకు చెల్లించవలసిన ఆర్థిక బకాయిల కు సంబంధించి షెడ్యూల్ ప్రకటించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శిలు నల్లూరి వెంకటేశ్వరరావు, కే వెంకయ్య, ఎం సంధ్యారాణి, సిహెచ్ ప్రభాకర్‌రెడ్డి, కిలారి వెంకటేశ్వర్లు, పాలపర్తి రామాంజనేయులు పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జీవీ శేషయ్య, వైవి వెంకట్రావు, ఆర్ నారాయణ, రమణమూర్తి, తాత వెంకటేశ్వర్లు, ఎం మాలకొండయ్య, సుధాకర్‌రావు, దార్ల శ్రీనివాసరావు, దామ కొండప నాయుడు, బి భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

# ఈ ప్రాంత ప్రజలు జన్మజన్మలకి నారా చంద్రబాబునాయుడుకి రుణపడి ఉంటాం

## నియోజకవర్గ పోల్ మేనేజ్మెంట్ క్లస్టర్ ఇంచార్జి కందుల రామిరెడ్డి

(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, డిసెంబర్ 18)

మార్కాపురం ప్రత్యేక జిల్లా ప్రకటించడంతో నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు చంద్రబాబు నాయుడుకి ధన్యవాదాలు తెలియజేశారు.

గురువారం మండలంలోని బుడ్డపల్లి గ్రామంలో ఎన్డీఏ కూటమి నాయకులు ప్రజలు, మహిళలు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, నియోజకవర్గ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి కృతజ్ఞత తెలియజేస్తూ పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పోల్ మేనేజ్మెంట్ క్లస్టర్ ఇంచార్జి కందుల రామిరెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలు ఎప్పటికీ చంద్రబాబు నాయుడుకి రుణపడి ఉంటామని, అత్యంత వెనుకబడిన ఈ ప్రాంతాన్ని జిల్లాగా ప్రకటించాలని గతంలో కోరామని, గత ప్రభుత్వ హయాంలో జిల్లాల పునర్విభజన జరిగినప్పుడు ఎంతో వివక్షతో ఈ ప్రాంతాన్ని విస్మరించారన్నారు. గతంలో హామీ ఇచ్చిన విధంగానే ఇప్పుడు మార్కాపురం జిల్లా ప్రకటించటం చంద్రబాబు నాయుడు కి ఈ ప్రాంత ప్రజలు ఎంతో రుణపడి ఎప్పటికి ఉంటామని అన్నారు. ఈ సంబరాల్లో టిడిపి మండల అధ్యక్షులు ఉడుముల చిన్నపరెడ్డి, మాజీ ఎంపీపీ పులివేముల ఏసుదాసు, క్లస్టర్ ఇంఛార్జి పుచ్చనూతల గోపినాథ్‌చౌదరి, టిడిపి ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షులు కంచర్ల కాశయ్య, టిడిపి మండల నాయకులు ఈర్ల వెంకటయ్య, నంబుల లక్ష్మయ్య, కందుల చిట్టిబాబు, వెన్నా వెంకటరెడ్డితో పాటు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.





# మార్కాపురం జిల్లా ఏర్పాటుతో అభివృద్ధి

(షణ్ముఖ వెలుగు, కొనకనమిట్ల, డిసెంబర్ 18)

మార్కాపురం జిల్లా ఏర్పాటుతో అభివృద్ధి జరుగుతుందని మండల పార్టీ అధ్యక్షులు మూరబోయిన బాబురావు యాదవ్ అన్నారు. గురువారం మండలంలోని గరిమనపెంట పంచాయతీలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మార్కాపురం జిల్లా ప్రకటించిన సందర్భంగా సిఎం చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ళుగా వెనుకబడ్డ పశ్చిమ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే మార్కాపురం జిల్లా కావడమే లక్ష్యంగా తన తండ్రి ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి 63 రోజుల పాటు ఎన్నో పోరాటాలు చేశారన్నారు. ఆయన పోరాటాలను అప్పటి వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కానీ మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆ నాడు చేపట్టిన పోరాటాన్ని గుర్తించి ఆయన ఎన్నికల హామీల్లో భాగంగా మార్కాపురం జిల్లా ఏర్పాటు చేస్తామని మాటిచ్చారన్నారు. ఆ మాటకు కట్టుబడి నేడు చంద్రబాబునాయుడు మార్కాపురం జిల్లాను ప్రకటించడం పశ్చిమప్రాంత ప్రజానీకానికి చంద్రబాబునాయుడు ఇచ్చిన ప్రాధాన్యత అర్థమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మూరబోయిన బాబురావు యాదవ్, పరిటాల సుబ్బయ్య, కనకం నరసింహారావు, వరికూటి రామిరెడ్డి, కాటం రాజు, శ్రీనివాస్, భవనం వెంకటరెడ్డి, మల్లి, కాశయ్య, నర్సారెడ్డి, పెద్ద కాశయ్య, తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.





# వీరేపల్లిలో బాలికల హాస్టల్ భవనం పునఃప్రారంభం

**ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు**
**వసతులపై విద్యార్థినులతో ముచ్చటించిన ఎమ్మెల్యే**
**ఇంటూరికి ఘన స్వాగతం పలికిన**
**ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు**



**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, డిసెంబర్ 18)**

మండలంలోని వీరేపల్లి మోడల్ స్కూల్‌లో విద్యార్థినుల హాస్టల్ భవనాన్ని అధునాతనంగా తీర్చిదిద్దగా కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గురువారం ప్రారంభించారు. అన్ని వసతులతో హాస్టల్ భవనాన్ని నిర్మించడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. స్కూలు విద్యార్థినులతో మాట్లాడారు. విద్యాబోధన, మెనూ ప్రకారం భోజనం, హాస్టల్ లో ఇతర వసతులు ఎలా ఉన్నాయో విచారించారు. చక్కగా చదువుకుంటే భవిష్యత్తు బాగుంటుందని, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని బాలికలకు ఎమ్మెల్యే సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య కోసం కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు . నారా లోకేష్ విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అనేక మార్పులు వచ్చాయని తెలిపారు. విద్యార్థుల్లో పరిజ్ఞానం పెంచడం, ప్రతిభను గుర్తించి అవకాశాలు కల్పించడం, పాఠశాలలో వసతులు కల్పించడం లాంటి అంశాలపై లోకేష్ ఎక్కువగా దృష్టి పెట్టారని చెప్పారు. ఉపాధ్యాయులు కూడా ప్రభుత్వ లక్ష్యాన్ని గమనించి



విద్యా బోధన చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బి సురేష్ బాబు ఎంఈఓలు పి.వి రత్నం వెంకటరమణయ్య, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పి శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ వెంకట సుధారాణి మోడల్ స్కూల్ చైర్మన్ తాటితోటి ప్రభాకర్ రావు, మండల పార్టీ అధ్యక్షులు రాచగర్ల సుబ్బారావు, మండల ప్రధాన కార్యదర్శి సుదర్శి శ్రీనివాసులు, గ్రామ పార్టీ అధ్యక్షులు లక్కంరాజు నరేష్ పార్టీ నాయకులు కే ఆదినారాయణ రాజు, జి సత్య ప్రభాకర్, ఎం ప్రభాకర్ రావు, ఎం గురవయ్య, డి నరసింహం, నతానియల్ పోలుబోయిన శ్రీనివాసులు, రావిపాటి మహేశ్వరరావు, చింతల సింగయ్య, తొట్టెంపూడి మాల్యాద్రి, మండలంలోని గ్రామ పార్టీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.







# విద్యార్థులు దేశభక్తితో, నైతిక విలువలతో ముందుకు నడవాలి

**నీతి, నిజాయితీ, ధర్మాన్ని పాటించే వాళ్లు రియల్ హీరోలు**
**రైజ్ ఇండియా విజన్ 2047లో విద్యార్థుల పాత్ర కీలకం**
**ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు**




**(షణ్ముఖ వెలుగు, వినుకొండ, డిసెంబర్ 18)**

ప్రతి విద్యార్థి నైతిక విలువలు అలవర్చుకొని దేశభక్తితో ముందుకు నడవాలని ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ ఎమ్మెల్యే జీవి ఆంజనేయులు కోరారు. శివశక్తి లీలా అండ్ అంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక లయోలా స్కూల్ ఆవరణలో జరిగిన రైజ్ ఇండియా విజన్ 2047 కార్యక్రమానికి చీఫ్ విప్ జీవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ దేశం కోసం పోరాడిన అల్లూరి సీతారామరాజు, ప్రకాశం పంతులు లాంటి మహనీయులను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు దేశభక్తితో విద్యలో రాణిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించి వికసిక్ భారత్, స్వర్ణాంధ్ర విజన్ 2047 దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని సూచించారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు నీతి, నిజాయితీ, దయ, ధర్మం, బాధ్యత, గౌరవం వంటి విలువలను అలవర్చుకొని ముందుకు సాగే వారే జీవితంలో రియల్ హీరోలని వివరించారు. విద్యార్థులను మంచి పౌరులుగా, సమాజానికి సేవ చేసే సంపూర్ణ వ్యక్తిత్వాన్ని అలవర్చుకునే విధంగా ఉపాధ్యాయులు తల్లిదండ్రులు కీలక పాత్ర పోషించాలని కోరారు. విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి నూతన టెక్నాలజీలతో నైపుణ్యాలను సంపాదించి ప్రపంచంలో భారతదేశం అగ్రగామిగా నిలిచేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర విజన్ 2047 ప్రతి విద్యార్థి అర్థం చేసుకొని దేశాభివృద్ధిలో చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. నైతిక విలువలతో విద్యలో ఉన్నత శిఖరాలు అధిరోహించి ప్రతి ఒక్కరూ భావి భారత పౌరులుగా ఎదగాలని ఆయన ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.





# కోటి సంతకాల పత్రాల ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే కదిరి




**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, డిసెంబర్ 18)**

ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రవేట్ పరం చేస్తున్న చంద్రబాబు ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాష్ట్రంలో సేకరించిన కోటి నాలుగు లక్షల పదిహేడు వేల సంతకాల సేకరించిన ఆపత్రాలను రాష్ట్ర గవర్నర్‌కు సమర్పించే కార్యక్రమంలో భాగంగా గురువారం తాడేపల్లిలోని వైసీపీ కేంద్రకార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల సమన్వయకర్తలు, రీజనల్ కోఆర్డినేటర్లు, పార్లమెంట్ పరశీలకులు, జిల్లాల పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులతో వైయస్ జగన్ మోహన్‌రెడ్డి సమావేశామయ్యారు. ఈ కార్యక్రమంలో కనిగిరి మాజీ ఎమ్మెల్యే విశాఖపట్నం పార్లమెంట్ పరశీలకులు కదిరి బాబురావు, జిల్లా పార్టీ అధక్షులు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జడ్పి చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# మణికేశ్వరం గ్రామంలో పర్యటించిన గుండ్లకమ్మ ప్రాజెక్టు అధికారులు





**(షణ్ముఖ వెలుగు, అద్దంకి, డిసెంబర్ 18)**

విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాలతో కందుల ఓబుల్‌రెడ్డి గుండ్లకమ్మ ప్రాజెక్టు పరిధిలోని ముంపు గ్రామమైన మణికేశ్వరంలో గురువారం ప్రాజెక్టు అధికారులు రెవెన్యూ ఇన్స్పెక్టర్ అరుణ, సర్వేయర్ కోటంరాజు పర్యటించారు. నివేశ స్థలాలు ఎందరికి రావాలి,పునరావాస కాలనీలో మౌలిక వసతులు తదితర అంశాలపై నివేదిక ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈసందర్భంగా గ్రామ తెదేపా నేత షేక్ కరిముల్లా గ్రామంలోని ఎస్సీ సామాజిక వర్గం వారికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయలేదని, అలానే ముస్లిం సామాజిక వర్గానికి చెందిన కొంతమందికి నివేశస్థలాలు కేటాయింపు జరిగి ఇళ్ళ పట్టాల పంపిణీ చేయలేదని. భూసేకరణ పనులు వేగవంతం చేసి, ముంపుకు గురైన నిర్వాసితులు సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో బడావలి, మేకల ఆదినారాయణ, మాథ్యూస్, అబ్రహం, సుధా, ఫకీర్, కాలేషా, ప్రకాష్, విఆర్ఓ ధారవి, తదితరులు ఉన్నారు.

# సిఐటియు అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలని ప్రచారం







**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, డిసెంబర్ 18)**

డిసెంబర్ 31 నుండి 2026 జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరిగే సిఐటియు అఖిలభారత 18వ మహాసభలను జయప్రదం చేయాలని ఈరోజు ఉలవపాడు మండల కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యంలో కార్యకర్తలు ప్రభుత్వ కార్యాలయాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. మాస్‌గా నిధి వసూలు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీఐటీయూ జిల్లా నాయకులు జీవీబీ కుమార్ మాట్లాడుతూ కార్మిక వర్గ సమస్యల పరిష్కారం కోసం సిఐటియు 1970 ఏర్పడిందని తెలిపారు. సిఐటియు కార్మిక వర్గానికి అనేక విజయాలు సాధించి పెట్టింది అన్నారు. నేడు కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఇప్పుడున్న కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్ లు గా మార్చిందని అన్నారు. దీని వలన కార్మికవర్గం కట్టు బానిసలుగా మారతారని అన్నారు. కార్మిక చట్టాలను కాపాడు కోవటానికి పోరాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎస్‌డి గౌస్ బాషా, సాదు చెన్నకేశవులు, దువ్వూరి జాన్, వై నాగార్జున, జి ప్రసన్నకుమార్, జి శివకుమార్, రంగనాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# అల్లూరికి అండగా నిలిచిన "ఫజుల్లా ఖాన్ - షేక్ మదీనా" పుస్తకం ఆవిష్కరణ







**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, డిసెంబర్ 18)**

కనిగిరి మహిళా డిగ్రీ కళాశాల, ఎమ్ఎస్ఆర్ జూనియర్ కాలేజీ, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జడ్పీ బాలికొన్నత పాఠశాల, లైబ్రరీ లో ఈ పుస్తకం ఆవిష్కరణ జరిగింది. పాలిటిక్స్ లెక్చరర్ కాశిరెడ్డి మాట్లాడుతూ ఇది చరిత్రకు గుర్తుగా ప్రతి ఒక్కరు చదవ వలసిన పుస్తకం అన్నారు. కామర్స్ లెక్చరర్ సాయి మాట్లాడుతూ మనకు స్వతంత్ర ఉద్యమం తెలుసు కాని ఎంతో మంది మన స్వేచ్ఛ స్వాతంత్రత కోసం అసువులు బాసారో తెలియచేసే మన్యం వీరుడు అల్లూరి సీత రామరాజు కు అండగా ఫజులుల్లా ఖాన్, షేక్ మదీనాలు కృషి మన ప్రపంచానికి తెలియచేసేలా రాయడం గొప్ప విషయం అన్నారు. ఎమ్ఎస్ఆర్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువ వలసిన పుస్తకం ఈ పుస్తకం రాసిన రచయిత నసీర్ అహమ్మద్‌కి ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం సంజీవి మాట్లాడుతూ ఇది మంచి పుస్తకం, ఇలాంటి పుస్తకం రాయడం వలన మరిచిపోయిన వ్యక్తులను, మహనీయులను అల్లూరి సీత రామరాజును గుర్తు చేసుకోవడం శుభ పరిణామమన్నారు. రచయితకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చరిత్ర అధ్యాపకులు స్వర్ణ బాబు, రాజా, మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ప్రముఖ చరిత్రకారుడు సయ్యద్ నశీర్ అహమ్మద్ అహ్మద్ రచించి వెలువరించిన నూతన పరిశోధనాత్మక పుస్తకం "అల్లూరికి అండగా నిలిచిన ఫజుల్లా ఖాన్ – షేక్ మదీనా" రెండు తెలుగు రాష్ట్రాలలో డిసెంబర్ 17న సుమారు వంద చోట్ల విడుదల అయ్యింది. సయ్యద్ నశీర్ అహమ్మద్ రచించి ప్రచురించిన "మహాత్మా గాంధీ ముస్లిం సహచరులు మరియు అనుచరులు", "పండిత్ రామప్రసాద్ బిస్మిల్ – అష్ఫాఖుల్లా ఖాన్", "ఆధునిక భారతదేశం మొదటి ముస్లిం ఉపాధ్యాయురాలు : ఫాతిమా షేక్", "మహాత్మా గాంధీ ప్రాణ రక్షకుడు – బతాక్ మియా అన్సారీ" పుస్తకాలు కూడా భారతదేశంలోని పలు రాష్ట్రాలలో వందలాది చోట్ల గతంలో ఆవిష్కరింబడ్డాయి.



# ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజత

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 18)**

నగరంలోని మంగమూరు రోడ్డులో మర్రిచెట్టు దగ్గర సంతనూతలపాడు ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి సీఎంఆర్ఎఫ్ కింద మంజురైన 24 మందికి రూ.19,19,085ల చెక్కులను లబ్ధిదారులకు సంతనూతలపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఉప్పుగుండూరు నాగేశ్వరరావు, మల్లవరం ఆలయ చైర్మన్ మార్నేని రాఘవ, మండల నాయకులు, గ్రామ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# పోలియో అవగాహన ర్యాలీ 2,725 మంది చిన్నారులే లక్ష్యం







**(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, డిసెంబర్ 18)**

"నిండు జీవితానికి రెండే రెండు పోలియో చుక్కలు" అనే నినాదంతో తర్లుపాడు మండల కేంద్రంలో గురువారం భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, వైద్యాధికారి డాక్టర్ వి సోనియా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.తర్లుపాడు బస్టాండ్ సెంటర్ మీదుగా సాగిన ఈ ర్యాలీలో, పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాలుపంచుకోవాలని సిబ్బంది నినాదాలు చేశారు. 5 ఏళ్లలోపు చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ, గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ప్రదర్శన నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ సోనియా మాట్లాడుతూ మండలంలో పోలియో చుక్కల పంపిణీకి సంబంధించిన ప్రణాళికను వివరించారు, తర్లుపాడు మండల పరిధిలోని 0 నుండి 5 సంవత్సరాల వయస్సు గల మొత్తం 2,725 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ కార్యక్రమాన్ని డిసెంబర్ 21 నుండి మూడు దశల్లో పూర్తి చేస్తామని, ఏ ఒక్క చిన్నారి కూడా విడిపోకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆమె తెలిపారు. ఇంటింటికీ వెళ్లి చిన్నారులను గుర్తించి, చుక్కలు వేయడంలో క్షేత్రస్థాయి సిబ్బంది చురుగ్గా వ్యవహరించాలని ఆదేశించారు. ఈ అవగాహన కార్యక్రమంలో సిహెచ్ఓ మంత్రు నాయక్, హెల్త్ అసిస్టెంట్ షేక్ అబ్దుల్ ఖలీల్, సూపర్ వైజర్ నాగేశ్వరమ్మ, పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు మరియు ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com